# ★ అతను!... ★

రచన : శ్రీ ఆదివిష్ణు

గుంటూరు బస్‌స్టాప్ చాలా హడావిడిగా వుంది. పెళ్ళిళ్ళ సీజనేమో ప్రయాణీకులు రద్దీగా వున్నారు. నా వాచీలో ఒంటిగంటయింది ఎండ తీవ్రంగా వుంది; గుంటూరని విరూపించటానికిగాను. దాపులో కిళ్ళీకొట్టుకు వెళ్ళి సోడా ఒకటి తాగాను సిగరెట్టు పేకెట్టు ఒకటికొని సిగరెట్టు ముట్టించాను. టికెట్ తీసుకొందామని వెళ్లాను. చూద్దునుగదా అక్కడ నాలాటి ప్రయాణీకులు కొన్ని వందలు! (ఆశ్చర్యం లేదు) ఒక వరుసలో వెయిట్ చేస్తున్నారు. వాళ్లను చూస్తూ నవ్వాలో, ఏడవాలో తెలియటం లేదు. ఈనాటికి ప్రయాణం మానుకోవాలేమో ననిపిస్తుంది నాకు. అయినా ప్రయత్నమనేది వుండాలిగా...

నేను బందరు పోవాలి. మా మిత్రబృందంలో ప్రముఖుడు రామం. వాడి పెళ్లి జరుగబోతూందంటె, నే లేకుండా జరుగుతుందా?... జరగవచ్చు కాని ఏదో లోపం కనుపిస్తుంది .. చిన్నతనంలో .. హైస్కూలు స్టడీస్‌లో పదిమంది మిత్రులం ఒక జట్టుగా వుండే వాళ్లం. ఆ మిత్రులంతా ఉద్యోగ రీత్యా విడిపోయాం గత మూడు సంవత్సరాల నుంచి మేమంతా విడిగానే వుంటూ వచ్చాం. మూడు సంవత్సరాల క్రితం-రంగనాధం పెళ్లికి, ఇదే సీజన్లో కలుసుకొన్నం. నాకు రామం పెళ్లంటె పరమానందంగా వుంది. వాడో ఇంటివాడవబోతున్నాడని కాదు... మిత్రులంతా వాడి దయవల్ల ఒకచోట కలుసుకోబోతున్నామని. మరి ఈ రద్దీ అది చూస్తూంటే 'నేను ఆ ఆశను వదుకోవాలేమోననిపిస్తుంది...

ఎక్కడెక్కడి వాళ్లమంతా ఒకచోట చేరుకోబోతాం. కొందరు ఇంటి ఇల్లాళ్లతో, మరికొందరు చంక బిడ్డలతో వస్తారు. వాళ్లందర్నీ ఆ స్థితిల్లో చూడాలనే ఉబలాటం నాకు మిక్కుటంగా వుంది... మా మిత్రబృందంలో యింత వరకు నాకు, రామూకే వివాహం కాలేదు. ఇప్పుడేమో వాడు గూడా ఓ యింటివాడై పోతూన్నాడు. ఇకపోతే నేనొక్కడ్నే బ్రహ్మచారిగా మిగిలి పోయింది

గుంటూరులో మెడిసన్ చదువుతున్నాను ప్రాక్టీసంటూ ఒకటి పెట్టుకొన్న మీదట పెళ్లి చేసుకోవాలని వుంది మా యింట్లో వాళ్లందరి అభిప్రాయం గూడా అదే!... రామంగాడు అక్కడి కాలేజీలో లెక్చరర్ చేస్తూన్నాడు అదృష్టవంతుడు! వాడు చదివిన కాలేజీలోనే అధ్యాపకుడుగా నియమింపబడ్డాడంటే అదృష్టం కాదు మరి! మొత్తానికి మిత్రులంతా దైవకృప వల్ల, పెద్దల ఆశీర్వచన ఫలంవల్ల ఇంత అభివృద్ధిని అందుకో గలిగాం!...

చిన్ననాటి మధురస్మృతులు కొన్ని నాలో రగిలాయి. నవ్వుకున్నాను. పిచ్చివాణ్ణయి పోయాను ఆ కొద్దిసేపటిలోను. అప్పుడే రెండు స్టేట్ బస్‌లు వెళ్లిపోయాయి.

నాకు ఆతురత ఎక్కువైంది... టైము రెండయింది ఉక్కపోస్తుంది. ఆ లైనులో అలానే నిలబడ్డాను. రామంగాడి గురించి ఇంకా ఆలోచిస్తూనే వున్నాను... వాడికి కాబోయే శ్రీమతి పెద్దింటి పిల్లట. మామగారు రిటైర్డ్ కలక్టరు. ఉద్యోగ రీత్యా బాగా సంపాదించారట. రామంగాడి అదృష్టం పండింది. రామం వాళ్ళ నాన్న గూడా రిటైర్డు గెజిటెడ్ ఆఫీసర్. తగిన వాళ్ళతోనే వియ్యమందుకొన్నారు...

ఇంకో బస్సుగూడా నిండుకొంది. నాకు విసుగు పుట్టుకొచ్చింది. ట్రైనుకు పోదామంటే సాయంత్రమయిదు గంటల వరకూ లేదు. పోనీ ఆ ట్రైను మీదనే పోదామంటే లగ్నం వేళకు అందిస్తే నమ్మకం నాకు లేదు మన పంక్చ్యువాలిటీ అది చూసిన తర్వాత- బస్సే నాకు శరణ్యం... నా ముందు వెనుకల కొంత సారి చూచాను. అందరిలోను ఆదుర్దా తాండవిస్తోంది. వాళ్ళలో వాళ్ళు ఏమిటో తిట్టుకొంటున్నారు- కొందరు ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శిస్తూన్నారు; మరి వాళ్ళకెంత జరూరు పనులున్నాయో యేమో ఇదొటి మనలో బాగా అలవాటయిపోయింది, ఎంతన్నా విసుగు కాని కష్టంగాని మనకు కలిగితే ప్రభుత్వాన్ని దూషించేస్తాం! ఏమిటో మనస్తత్వాలు, మనుష్యులూనూ! మారాలి... ఆ రోజు రావాలి...

ఒక గొంతు వెనుక నుండి నన్ను పలుకరించింది. "ప్లీజ్ కాస్త మేచెస్ ఇస్తారూ," నాగరికత ఉట్టిపడ్తూంది ఆ గొంతుక్కు ఇచ్చాను. సిగరెట్టు ముట్టించి అగ్గిపెట్టె నాకిస్తూ "థేంక్స్" చెప్పాడు. మనిషిని ఒకసారి పరికించాను. టకప్ చేశాడు. కాస్ట్లీ డ్రెస్. "బాగా వున్న వారి వలె కనుపిస్తూన్నాడు. మనిషి హుందాగా వున్నాడు. చేతికున్న వాచీ ముద్దుగా వుంది.

"ఏ ఊరు వెళ్ళాలండీ" అడిగాడతను. చనువు ఉట్టిపడ్తూంది ఆ మాటలో...

'బందరండీ" నా జవాబు.

"అలాగునండీ. నేనూ అక్కడికే పోవాలి అది మీ నేటివ్ ప్లేసను కొంటాను..."

"అవును"

"మరిక్కడేం చేస్తున్నారు ?"

"మెడిసన్ చదువుతున్నాను"

"పేరేమిటో చెప్పారుగారు" ఇంతకుముందు ఆయన అడిగినట్లు చెప్పాను ముక్తసరిగా

"నేను ఎక్సైజ్ డిపార్ట్‌మెంటులో ఇనెస్పెక్టరు చేస్తూన్నానండి ఆ... ఈ రోజుల్లో ఇదీ ఒక ఉద్యోగమేనంటారా? స్కేలెంత పెద్దదైనా ఈనాటి అవసరాలకు అనుకూలించేదట్లు లేదు. మీ రెలాగయినా లక్కీ ఫెలోస్... ఈ రోజుల్లో మీలాటి డాక్టరు ప్రాక్టీసుగాని ప్లీడరీగాని ధాన్యండీ రెస్పాన్సిబిలిటీ లేని ఉద్యోగాలు" ఇంకేదో చెప్పుకుపోతున్నాడు అడక్కపోయినా.

ముఖావంగా అవును కాదంటూన్నాను. అతను నా మాటల్ని పెద్ద లెఖ్ఖలోకి తీసికోకుండా తెగ వాగేస్తూన్నాడు. కొద్దిసేపు పాలిటిక్స్, కొద్దిసేపు సాహిత్యం, మరికొంతసేపు రోజులు వాటి రీతి ఇలాగు అంతనేది లేకుండా చెప్పుకు పోతున్నాడు. మరొక బస్సు గూడా వెళ్ళి పోయింది

నాకు ఆయన ధోరణంతగా బావుండలేదు. వినేవాడ్ని నాకే ఇంత విసుగ్గా వుంటే- అంతగా చెప్పే ఆయనకేం బాధలేకుండా వుంది. ఏమి మనిషి ?...

"చూశారూ! రోజులకు తగినట్టుగా వచ్చే సినీమాలుగూడా తగిపోయాయండీ. వెధవ టక్కు పిక్చర్లు... అసలు సినీమాలాంటె నాకు పడి చచ్చే పిచ్చలేండి. ఇప్పుడు కాస్త తగ్గించుకున్నాలెండి. మొదటు ండి తెలుగు సినిమా అంటె నాకాట్టె ఇష్టం లేదు, ఇంగ్లీషంటే. దాన్లోనూ ఆవాగార్డినర్‌గాని, స్టీవర్టు గ్రేంజరుగాని వున్న పిక్చరంటె తప్పకుండా చూస్తాను... మీరు హిందీ పిక్చర్స్ చూస్తారా?... ఇక హిందీ ఫీల్డులోకి దిగింది వ్యవహారం ఆ తర్వాత బెంగాలీ, తర్వాత తమిళ్ ఆపైన తెలుగు, కన్నడం... ఇంక అంతనేది వుండదు. జవాబు చెప్పకపోతే బావుండదని

(తరువాయి 19 వ పేజీలో)

## అతను!...

(10వ పేజీ తరువాయి)

"ఏదో మీలాంటి పిచ్చలేకపోయినా ... వెడుతూంటాన్లేండి".

"మీరూ అనెకాదు. మీరేకాదు ప్రతివాళ్లు యింతే... అప్పుడప్పుడు అనిపిస్తుంది మరీ యింత పిచ్చ పనికిరాదని కాని ఏం చేస్తాం చెప్పండి. ఆ... అన్నట్టు..." ఇక ఇతని నోటికి తాళం వెయ్యాలనుకొని సోడలమ్మే కుర్రాణ్ణి పిలచి రెండు డ్రింక్సుకు ఆర్డరిచ్చాను. ఆయన నా వంక చూస్తూ...

"అసలు బస్ స్టాండుల్లో కలర్స్ తాగ కూడదండి... తొందరతో వాళ్లేదో రంగు కలిపేసి మన ముఖాన్న కొడతారు అన్నట్టు సోడాలకు ప్రసిద్ధి... "ఓరి బాపురే ఈయన సర్వ క్షేత్రాలన్నిటిమీద వాక్ప్రావీణ్యము చూపుతాడేమో నని భయపడ్డాను. నవ్వు గూడా వచ్చింది

డ్రింక్సు వచ్చాయి తాగేశాము. డబ్బు లిస్తాంటె ఆయన తాగుతూనే.

"అదేమిటండి మీరివ్వటం. బలే వారె మీరుండండి." అంటూ తాగుతున్నాడు. అంతే గాని కనీసం జేబులో చెయ్యిగూడా పెట్టలేదు అది ఆయన తత్త్వమేమో! డబ్బులిచ్చి కుర్రాణ్ణి పంపాను.

నా అదృష్టం బావుందేమో దాదాపు పావు తక్కువ మూడింటికి టికెటు పుచ్చుకున్నాను బెజవాడకు. బెజవాడ నుంచి బందరుకు పోయె ఎక్సుప్రెస్ టయానికి అందుకొంటాననే నమ్మకం నాకిప్పుడు కలిగించి దైవానికి మనస్సుల్లో ధన్యవాదాలు అర్పించాను.

బస్సులో కూలబడ్డాను. నా ప్రక్కనే "అతను" కూర్చున్నాడు బస్సు కదలింది. ఆయనేదో చెప్పాకు పోతున్నాడు మిత్రుల మనస్సు లగ్నమవ్వటంవల్ల ఆయన మాటలను సరిగ్గా వినలేకపోతున్నాను. స్టేటు బస్సులను విమర్శిస్తూన్నాడు కాబోలు! మంగళగిరి వచ్చింది. ఇద్దరం సోడాలు తాగాం. డబ్బులు 'నేనే' ఇచ్చాను. సిగరెట్టు పాకెట్టుతీసి సిగరెట్టు ముట్టించి ఆయనకొంటి ఆఫర్ చెయ్యబోయాను.

"చైనుస్మోకరంటె మీరేనండి" ముఖస్తోత్రం చేశాడాయన సిగరెట్టు తీసికొంటూ. నేను అక్కడక్కడా స్మోకు చేస్తానుగాని నాకది అవసరమైగాదు. అయనింకా చెప్పుకు పోతున్నాడు. "మీకీ సిజర్స్ తప్ప మరేసిగరెట్టు స్మోకు చెయ్యరేమిటి?... నేనన్ని వెరైటీసు తాగుతాన్లెండి. సిగరెట్టు కాల్చవద్దంటారేగాని దానివల్ల పెద్ద హాని లేదండి నన్నడిగితే అసలు కాల్చవద్దని సలహాలిచ్చే పెద్దిపెద్ద డాక్టర్సు దగ్గరే పెట్టెలు పెట్టెలు సిగరెట్లు ఖర్చవుతాయి. అంతెందుకు నాకు తెలిసిన డాక్టరొకాయన.. " అ... ఇక దిగింది మరోఫీల్డులోకి. ఆయన చెప్పబోయేది వింటానికి ఓపికలేని నేను "మీ పేరేమిటో?" అడిగాను...

"అసలు మా పేరెంట్సు పెట్టిన పేరేమో తిరుమల వేంకట రమణమూర్తండి. మా ఫ్రెండ్సంతానేమో "ఒరే మూర్తి" అనిపిలుస్తారు. ఆ పేరు నాకంతగా ఇష్టంలేక 'రమణ' అని పిలువండని హెచ్చరిక చేశాను. దాంతో రెండు పేర్లూ నాకు స్థిరపడ్డాయి. కొందరు "మూర్తం" టారు మరికొంతమందేమో "రమణం" టారు. అసలు పేరులో ఏముందిలేండి నా బొంద. మా నాన్నమ్మ గురించి ఈ సందర్భంలో చెప్పక తప్పదు. అవిడ ..' నాకు నిజంగా ఆశ్చర్యమైంది. సంక్షిప్తంగా, మూడుముక్కల్లో ముగిస్తాడేమోనను కొన్న నాకు ఆశాభంగమైంది. ఇక మీరు దయచేసి మాటడకండనటానికి మొహమాటమేమో అడ్డమైంది.

"అన్నట్టు మీరు ప్రస్తుతం గుంటూరులోనేనా వుంటా" అడిగాను.

"అవునండి. ఏమిగుంటూర్లేండి. ఇంటి అద్దెలకీ బోల్డు పోయాలిసివస్తుంది. అసలు ఈ సిటీ లైఫ్ మెయిన్‌టైయిన్ చెయ్యటం మాటలు కాదులెండి ఈ వాతావరణమదీ వంటికేమైనా బావుండి చస్తుందాంటె అదీలేదు. డాక్టర్లే అన్నారా గ్రామం దేశానికి పట్టుకొని... నన్నడిగితే విలేజి లైఫ్ దీనికంటె వెయ్యిరెట్లు పెట్టటాను. అసలు మాది ముందో కుగ్రామం లేండి .."

"అబ్బాంధవా! ఈసోది వినేబాధ పగవాడికైనా వద్దురాబాబూ! అనుకున్నాను మదిలో కాస్త బాధండి ఆయన చెప్తూనే వున్నాడు - తనెలా పెద్దవాడయ్యాడో... ఎంత గారాబంతో పెరిగాడో... మొదలైన విషయాలన్నీను

'బందరు ఏం పనివుండి వస్తున్నారు' అడిగాను.

"ఏదో మేరేజి వుందిలెండి మా చెల్లెలిది. ఈరోజుల్లో మేరేజి గూడా కాస్ట్లీ ఎఫైర్లేండి. చీప్‌లో పోవాలంటె పురాణాల్లో చెప్పినట్టు గాంధర్వ వివాహం చెస్తంటాను..." మొదలు ఇక అదేవరుస, ఈ "మనిషిని" ఇంకేవిషయాల్లోను కదుపగూడదనే నిశ్చయానికొచ్చాను. అతను పాశ్చాత్య వివాహాలు, హైందవ వివాహాలు గురించి ధంచేస్తున్నాడు. బస్సులో వాళ్లందరు అతని ఉపన్యాసం వింటూన్నారు శ్రద్ధగా. వాళ్లకు కాలక్షేపంగావుంది" నాకు కర్ణకఠోరంగావుంది'

అతను జేబులు తడుముకొన్నాడు. ఉపన్యాసం కొంతసేపు ఆపాడు. కాస్త ఫీలవుతూ "సారీ సిగరెట్లు అయిపోయాయి. ఓ సిగరెట్టుంటె ఇవ్వండి" అడిగాడు. ఇచ్చాను. దాన్ని ముట్టించి ఒక్కదమ్ములాగి ఫేషన్‌గా పొగను పైకి వదిలాడు.

"మీరూ చైనుస్మోకరేనన్నమాట" ఆయన మాట ఆయనకు వప్పచెప్పాలనే ఉద్దేశ్యంతో అడిగాను

"ఏదో లేండి...అసలు యిప్పుడేమి వుందిలేండి. నా చిన్నతనంలో - ఎదహారు పదిహేడు సంవత్సరాల వయస్సులో నన్నమాట. గంటకు పాకెట్ తగలేసి పారేశేవాణ్ణి" మంటలోపెట్టి తగలేశేవాడేమో!

బస్సు వేగంగా పోతూంది. కృష్ణావేణి దగ్గరవుతుంది. ఆయన నదినిగురించి, దాని ఉపయోగాలు ప్రమాదాల గురించి పది నిమిషాలు మాటాడారు.

బస్సు బెజవాడ బస్సు స్టాండుకు వచ్చింది. టైం నాలుగున్నరయింది. ఇంకో అరగంట టైముంది బందరు ఎక్సుప్రెస్ కదలటానికి. కాస్త కాఫి తాగుదామని హోటల్లో దూరాను. 'అతనూ' వచ్చాడు. కాఫీలకు ఆర్డరిచ్చాను. వచ్చాయి తాగుతున్నాం. సర్వరు బిల్లురాసి బల్లమీద పెట్టాడు. పంకా గాలికది రెపరెపలాడుతూంది.

కాఫీ తాగటం ముగించాను. బిల్లునుతీసికో పోయాను ఆయన కాఫి తాగుతూనే "మీరు కూర్చోండి బిల్లు నేనిస్తాను" అన్నాడు. ఆయన తత్త్వాన్ని అర్థంచేసికొన్న నేను "సరే మీరే బిల్లివ్వండి నేను పే చేస్తాను" అన్నాను. అతను నా ఛలోక్తికి నవ్వాడు గట్టిగా.

కౌంటరు దగ్గరకుపోయి డబ్బు లిచ్చాను. మిగిలిన కాఫీనంతా ఒకి గుటకలో స్వాహా చేసి నన్ననుసరించాడాయన. బయటకు వచ్చాం. టిక్కెట్లు తీసికొన్నాం. బస్సింకా కదలటంలేదు. "ఇప్పుడే వస్తాను. కాస్త ప్లేసు చూస్తూండండంటూ బస్సుదిగి బయట కెళ్లాడు బస్సు నెమ్మది నెమ్మదిగా నిండుకొంటుంది. అయిదు నిమిషాల తక్కువ అయింది. రామంగా దీ లగ్నం రాత్రి 9 30 గంటలకు. బస్సు బందరు చేరుకొనే సరికి 7-30 అవుతుంది. "అమ్మయ్య" ఎలా అయితేనేం లగ్నానికి అందుకొంటున్నాను అదే పదివేలు... ఈ సరికి మిత్రబృందమంతా బందరు చేరుకొంటారు. నా గురించి ఎదురు చూస్తూంటారు బహుశా. నన్ను చూడగానే

"ఏరోయ్ డాక్టరుగారూ! ఎప్పుడొచ్చారేమిటి?" మొదలైన ప్రశ్నలతో నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేస్తారు. ఆపైన కాస్సేపు చంటిగ్ చేసి నన్ను చావగొడతారు. తర్వాత పేకాట మొదలుపెట్టి చిన్ననాటి సంఘటనల్ని చదువుతారు పిచ్చిగా నవ్వుకొన్నాను లోలోన...

ఈ ఆలోచనల్లో పడిపోయి "నన్ను" నేను మరచిపోయాను. బస్సు బయలుదేరింది 'అతను' పరుగెత్తుకుంటూ వచ్చి బస్సెక్కాడు కిళ్ళీ వేశాడు. జేబులో చెయ్యిపెట్టి యేదో తీయబోయాడు బహుశా నాకూ కిళ్ళీ తెచ్చాడేమో! కాదు. సిగరెట్టుపాకెట్టు తీసి "ఒక" సిగరెట్టు తనే ముట్టించుకొన్నాడు. ఆయన తత్వాన్ని మనసులో చీదరించుకొన్నాను నేనూ నా ఆఖరి సిగరెట్టు ముట్టించుకొన్నాను... ఆయన మౌనవ్రతము వహించాడు. మరి ఆఫరింగ్ ఎటు పోయిందో యేమో. కంకిపాడు వచ్చేసరికి మూడు సిగరెట్లు కాల్చాడు "నోటతో" కనీసం ఒక్క సిగరెట్టయినా నాకు ఆఫర్ చెయ్యలేదు

నేనతన్నింత వరకూ సరిగ్గా అర్థంచేసుకోలేకపోతున్నాను. ఏమిటాయన తత్వం? ఇంత వరకు నాకో ఆత్మీయుడై ఇంతలో... ఇంతగా మారిపోవటానికి కారణం?... తెలిసింది కాదు. "అతని"కింతవరకు ఎన్ని సిగరెట్లు ఇచ్చాను! ఎన్ని సోడాలు... వాటికి విలువ కట్టడం లేదు గాని... ఆయన కుండవద్దు కల్చరనేది... నన్నూరిస్తున్నట్టు కాల్చుతున్నాడతను. నాదగ్గర సిగరెట్లయిపోయాయి. బస్సుదిగి కొందామంటే, ఎక్స్‌ప్రెస్ కావటం మూలంగా కొన్ని నియమిత హాల్టుల్లోనే ఆగుతుంది. నాకు పెద్దగా స్మోకు చెయ్యాలని కాదు కాని...ఆయన్ని చూస్తూంటే!

ఇటువంటి మనుష్యులతో నాకింతవరకు పరిచయ భాగ్యం లభించలేదు. రామంగాడి లగ్న ఫలమంటూనే నేసినాడు ఓ వ్యక్తి విచిత్ర మనస్తత్వాన్ని చదువుతున్నాను. అతన్ని నా జన్మలో మరచిపోలేను.

బస్సు పామర్రు చేరింది. ఆయన సోడా "ఒకటి" తాగాడు. బస్సుదిగి సిగరెట్టు పాకెట్టు ఒకటికొని బస్సెక్కాను. బస్సు కదిలింది. "చూశారూ ఆ కిళ్ళీకొట్టు వెధవ... అదే బెజవాడలో. నాకి సత్తు అర్ధరూపాయి తోశాడండి. అంతా దగా మోసం. ఛీ. ఛీ.

అవును "దగా మోసం" నా నోటిలో నానుతుందా మాట. "అతని" లాటి వాడికలా జరిగినా పాపం లేదు. ఆయన మళ్ళీ ఒక ముక్కయినా మాటాడటం లేదు. సిగరెట్టు ముట్టించాను. ఆయనకో సిగరెట్టు ఆఫర్ చేశాను. థేంక్సు గూడా చెప్పకుండా సిగరెట్టందుకున్నాడతను. "భగవాన్! ఎలాటి వాణ్ని సృష్టించావయ్యా నీ యీ సృష్టిలో "నవ్వుకున్నాను...

బందరు బస్సు స్టాండులో బస్సు ఆగింది. బస్సు దిగి రిక్షా ఎక్కాను పెళ్ళిపందిరి దగ్గర పడింది. రిక్షా దిగాను పందిట్లోకి అడుగు పెట్టాను. రంగనాథంగాడు ఎలుగెత్తి "ఓరేయ్ డాక్టరుగాడొచ్చాడోయ్" అని అరిచాడు. ఇంకేముంది మిత్రులంతా నన్ను చుట్టుముట్టారు. రామంగాడు - పారాణి పాదాలతో! కాటుక కళ్ళతో! నుదుట తిలకపు బొట్టుతో! బుగ్గన చుక్కతో! - కొంత సిగ్గుపడుతూ వచ్చా(డు)

"ఏరా బుద్ధాయ్. రెండ్రోజులు ముందుగా రారా అంటె ఇప్పుడా రావటం. బాగా వుంది అసలు నువ్వు రావనుకొన్నాం". ఆ మాటల్లో కొత్త రకం వుంది.

"ఆ వాడు రాకపోతే పాముకలరగ బొడిచే వాణ్ణి తెలుసాటూ" అప్యాయతకొద్దీ అన్నంత పని చేశాడు చపలమతి చలపతి.

"వచ్చావ్ రా బావా! వెధవ పరాచికాలు మీరూనూ..." ఇంకా అంటూనే వున్నాను పెళ్ళిపందిట్లోకి "అమ్మ!", బంధుమిత్రుడు- వచ్చాడు. కాస్త కంగారు తిన్నాక, మామ హుషారుగా వచ్చాడు. మిత్రబృందం ముఖాలన్నీ 'అతని' తీక్షణంగా చూశాయి. రాముగాడితో ఏమిటో మాటాడాడు. రామం మాకతన్ని పరిచయం చేశాడు.

"ఈయనే మా బ్రదరిల్లా ... సెంట్రల్ ఎక్సైజ్ డిపార్టుమెంటులో..." ఇక వినలేకపోయాను. నిశ్చేష్టుడనయ్యాను ఒక్కొద్దిసేపు.

"ఎంత అన్యాయం చేశావయ్యా భగవాన్... రామం యిబ్బంది ముందుముందు యింకెంతో! ఇతనితో!" అనుకుంటూ విడిదింటివైపు విసురుగా నడిచాను అక్కడ నిలువలేక -

వీడిల్లా వెళ్ళిపోవటానికి కారణమేమిటానట్టు మిత్రులంతా నావంక చూస్తూనే వున్నారు గుడ్లప్పగించి.**

## చెయ్యనినేరం - వెయ్యనిశిక్ష

( 9 వ పేజీ తరువాయి)

వాళ్ళకు ఎట్లాగు ఈ అవకాశము లేనే లేదు... ఏమంటావు ....' కూతురి మొహంలోకి చూశాడు.

వంచినతలెత్తకుండా, కళ్యాణి ఎదురుగా నిలబడి. కాలిబొటనవేలుతో. నేలనుగీస్తూ ఏమీ సమాధానం చెప్పకుండా వుండిపోయింది.

కాంతారావు తనలోతాను నవ్వుకున్నాడు. ఏమంటుంది తానుమాత్రం. ఉద్యోగం చెయ్యటం చేదా! డబ్బు సంపాదించటం తప్పా! మొదట్లో బెరుకుగానే వుంటుంది. అయితే నేనుకూడా అమ్మాయితోపాటు వెళతా! దానిదగ్గరేవుంటా ఒకటి రెండు నెలలు - కొత్తపోయిన తర్వాత తిరిగి రావచ్చు. మొత్తంగా కలిపి 120 రూపాయలు వస్తాయట! నెలకు 120 రూపాయలు సామాన్యమా! రేపు ఇంటి వస్తే మారిపోతుంది! అసలు మన జీవితాల్లో పెద్దమార్పు వచ్చినట్టే ఇంకో ఏడాదిపోతే గాయత్రికి కూడా ఉద్యోగం ఇప్పిస్తుంది తర్వాత పెళ్ళిళ్ళమాట! సంపాదిస్తున్న ఆడదాన్ని పెళ్ళిచేసుకోవాలంటే, ఏ మగవాడైనా సిద్ధపడతాడు. మనకా ఒప్పుడీ ఖర్చుండదు. ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసినవాళ్ళు ఒప్పుతాము. డబ్బుకు డబ్బువస్తుంది! గౌరవమర్యాదలూ నిలుస్తాయి అమ్మాయి పెళ్ళిచెయ్యండి పెళ్ళిచెయ్యండి అని వెంటపడుతుంది పాపం అవాల్య. అమాయకురాలు ఏమి తెలీదు తన బుద్ధికితోచిందే నిజమనుకుంటుంది. సూటి అనుకుంటుంది. అంతే అంతకు మించిన ఆలోచనపోదు. కళ్యాణి ఉద్యోగం చెయ్యటం, ఏమాత్రం ఇష్టం లేదు. పైగా, తండ్రి పాటుల్లో ఒక్కటయ్యారని ఉద్రేకం దానికి నేనేం చేస్తాను. అది చదువుకుంటే నాలుగు విషయాలు తెలుసుకుంది. ఈరోజుల్లో పరిస్థితులు ఎట్లా వున్నాయో అవగాహనం చేసుకుంది. నేను చెప్పినట్లు వింటుంది. నాకుమాత్రం ఈడొచ్చిన ఆడపిల్లల్ని. పెళ్ళిచేసి అత్తారిళ్ళకు పంపాలని తెలీదు! మనం ఇంట్లోకూర్చుని అర్థాపడితే ఆయ్యే పనులా ఇవి! దేనికైనా ప్రయత్నం చెయ్యాలి! ప్లానంటూ వెయ్యాలి. ఈరెండు లేకపోయినతర్వాత ఏమి ప్రయోజనం! ఏ విషయమైనా తాపీగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలిగాని, ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే లాభంలేదు. కళ్యాణికి ఉద్యోగం కుదిర్చానంటే కళ్యాణి పెళ్ళి ప్రయత్నం సగం పూర్తి అయినట్లేమాట!.... కాంతారావు కుర్చీలో కూర్చుని తనలోతాను తర్కించుకుంటూ ఆనందపడుతున్నాడు.

[సశేషం]